
సాక్షి
నిజామాబాద్
బుధవారం ၊ 26 ၊ మార్చి ၊ 2025



శిథిలావస్థలో వంతెన

సాలూర మండలంలోని ఖాజాపూర్–హున్సా గ్రామాల మధ్య వాగుపై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకుంది.

- 08లో ▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్ బుధ : 6:34 | సహర్ గురు : 4:53

గరిష్టం/కనిష్టం 38.8 /19.0

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. క్రమంగా ఎండ తీవ్రత పెరిగే అవకాశాలు ఉన్నాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

విద్యాశాఖలో శాస్త్రవేత్తతో ఒకరోజు

నిజామాబాద్‌అర్బన్: జిల్లా విద్యాశాఖలో 'శాస్త్రవేత్తతో ఒక రోజు' కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు దగ్గరలోని రీసెర్చ్ ల్యాబ్, ప్లానిటోరియం, స్పేస్ సెంటర్, ఐఐటీ వంటి సంస్థలను సందర్శించి అనుభవాలు నమోదు చేసుకోవాలి. అంతేకాకుండా సైంటిస్ట్‌ను ఒక రోజు వర్చువల్‌గా ఇంటర్వ్యూ చేయాలి. క్విజ్ పోటీలు, డిబెట్, పోస్టర్‌మేకింగ్ తదితర అంశాలు నిర్వహించాలి. 6 నుంచి 9వ తరగతి వరకు మే 5వ తేదీలోగా కార్యక్రమాన్ని నిర్వహించి స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ శిక్షణ వారికి వివరాలు పంపించాల్సి ఉంటుంది.

ఘనంగా గోటి తలంబ్రాల దీక్ష



నిజామాబాద్ రూరల్: శ్రీరామనవమి రోజున కనులపండువగా జరిగే భద్రాచల రామయ్య కళ్యాణానికి తెలంగాణ నుంచి 250 కిలోల గోటి తలంబ్రాలు అందించాలనే సంకల్పంతో శ్రీరామకోటి భక్త సమాజం ధార్మిక సంస్థ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా నగరంలోని కోటగల్లిలో ఉన్న జైరకోట్ హనుమాన్ మందిరంలో మంగళవారం వంద మందికిపైగా భక్తులు రామనామ స్మరణ చేస్తూ గోటితో వడ్లను ఒలిచి సంస్థ అధ్యక్షుడు రామకోటి రామరాజుకు అందజేశారు. మైసమ్మ, జైరకోట్, మల్లికార్జున, విజయగణపతి భజన మండళ్ల ఆధ్వర్యంలో నాలుగు గంటలపాటు భజన కొనసాగింది. రామకోటి రామరాజును భక్తులు సన్మానించారు. తాము భద్రాచలం వెళ్లలేకపోయినా.. తమ చేతులతో ఒలిచిన గోటి తలంబ్రాలు వెళ్లడం ఆనందంగా ఉందని భక్తులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

ఎట్టకేలకు ఇరిగేషన్‌లో పదోన్నతులు

సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్‌నాగారం: ఇరిగేషన్‌లో ఎట్టకేలకు పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేశారు. ఖాళీగా ఉన్న సీనియర్ అసిస్టెంట్ పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాల్సి ఉండగా, అధికారులు జాప్యం చేస్తున్న వైనాన్ని ఎత్తిచూపుతూ 'ఇరిగేషన్‌లో పదోన్నతుల లొల్లి' శీర్షికన జనవరి 8న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి శాఖ అధికారులు స్పందించారు. పదోన్నతుల ప్రక్రియకు ఎవరు అడ్డుపడుతున్నారు? ఎందుకు ఆలస్యం చేస్తున్నారని మండిపడినట్లు తెలిసింది. యూనియన్ నాయకులు తమకు సంబంధించిన వ్యక్తులను ఇతర జిల్లాల నుంచి తీసుకువచ్చేందుకు పదోన్నతులకు అడ్డుపడ్డారని ఉద్యోగులు చర్చించుకున్నారు. జూనియర్ అసిస్టెంట్ స్థాయిలో ఉన్న ఉద్యోగులు ఐక్యంగా నిరసన తెలిపేందుకు సిద్ధం కావడంతో ఫైల్‌ముందుకు కదిలింది. ఎట్టకేలకు ఇద్దరు జూనియర్ అసిస్టెంట్‌లకు సీనియర్ అసిస్టెంట్‌లుగా పదోన్నతి లభించింది.

ఆ పోస్టుల సంగతేమిటో?

ఇద్దరు జూనియర్ అసిస్టెంట్‌లకు పదోన్నతులు రావడంతో 2పోస్టులు ఖాళీ అయ్యాయి. వాటితోపాటు దఫేదార్(సీనియర్ అటెండర్) 2 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మొత్తం 4 పోస్టులకు సంబంధించి పదోన్నతులను పెండింగ్‌లోనే ఉంచారు. వీటితోపాటు ఆరు కారుణ్య నియామకాలు చేపట్టాల్సి ఉంది. కొంతమంది ముడుపులు ఇస్తేనే పదోన్నతులు ప్రక్రియను పూర్తి చేస్తున్నారని, లేకుంటే నెలల తరబడి ఆలస్యం చేస్తున్నారని శాఖ ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.


క్యాన్సర్ బాధిత బాలుడికి తోటి విద్యార్థుల చేయూత



డొంకేశ్వర్(ఆర్మూర్): లుకేమియా (బ్లడ్ క్యాన్సర్)తో బాధపడుతున్న బాలుడు నిర్విన్ తేజ్ వైద్యం కోసం తొండాకూర్ ఎస్ఎస్‌పీ పాఠశాల విద్యార్థులు విరాళాలు సేకరించారు. విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా విరాళాలు ఇచ్చారు. మొత్తం రూ.2లక్షల వరకు సమకూరగా, డబ్బులను నిర్విన్ తేజ్ కుటుంబ సభ్యులకు అందజేసినట్లు పాఠశాల కరస్పాండెంట్ చిరంజీవి మంగళవారం తెలిపారు. అదేవిధంగా ఎంఎస్ఆర్ ఫౌండేషన్ తరపున రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందించారు.

కేబినెట్‌లో బెర్త్ ఉత్కంఠ

- 15 నెలల ఉమ్మడి జిల్లా వాసుల నిరీక్షణ ఫలించేనా?
- రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు వచ్చే నెల 3న ముహూర్తం ఖరారు!
- సుదర్శన్‌రెడ్డికి బెర్త్ ఖాయమంటూ సంకేతాలు
- భూపతిరెడ్డి పేరును పార్టీ నాయకత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం





భూపతిరెడ్డి



సుదర్శన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు కాంగ్రెస్ అధినాయకత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో జిల్లాలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. 15 నెలల కిందట ప్రభుత్వం ఏర్పాటైనప్పటికీ ఉమ్మడి జిల్లా నుంచి ఇప్పటివరకు కేబినెట్‌లో బెర్త్ లేదు. తాజాగా విస్తరణ సమయంలో రాష్ట్రస్థాయిలో వివిధ సమీకరణాలు ప్రభావితం చేస్తున్నందున జిల్లాకు కేబినెట్‌లో బెర్త్‌పై అన్ని వర్గాల్లో ఆసక్తి కలిగిస్తోంది. ముఖ్యంగా కాంగ్రెస్ శ్రేణుల్లో చర్చోపచర్చలు జరుగుతున్నాయి. వచ్చే నెల 3న మంత్రివర్గ విస్తరణ అని వార్తలు వస్తున్నప్పటికీ మళ్లీ ఏమైనా వాయిదా పడుతుందా అనే విషయమై గుబులు కలిగిస్తోంది. జిల్లా నుంచి కేబినెట్ బెర్త్ ఖరారైతేనే తమకు నామినేటెడ్ పదవులు దక్కే విషయంలో కచ్చితమైన ముగింపు వస్తుందని ఆశావహులు సైతం ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

అయితే ఇటీవల కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జిగా వచ్చిన మీనాక్షి నటరాజన్ నిర్మాణాత్మక విషయాల్లో తన మార్క్ చూపిస్తున్న నేపథ్యంలో ఎలాంటి అనూహ్య నిర్ణయాలు ఉంటాయోననే ఆసక్తి రాష్ట్ర వ్యాప్తంగా నెలకొంది.

సుదర్శన్‌రెడ్డి వైపే సీఎం మొగ్గు

మాజీ మంత్రి, బోధన్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సీనియర్ నేత పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి ఖాయమనే వార్తలు వస్తున్నాయి. పీసీసీ సర్కిళ్లతో పాటు ఢిల్లీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం మేరకు సుదర్శన్‌రెడ్డికి కచ్చితంగా బెర్త్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే సుదర్శన్‌రెడ్డి అన్నీ తానై జిల్లాలో అన్ని వ్యవహారాలను సమీక్ష చేస్తూ చక్కబెడుతూ వస్తున్నారు. షబ్బీర్‌అలీ ఎమ్మెల్సీ పదవి, తద్వారా మైనారిటీ కోటాలో కేబినెట్ పదవి ఆశించి నప్పటికీ పార్టీ నాయకత్వం అవకాశం ఇవ్వలేదు. సుదర్శన్‌రెడ్డిని తన కేబినెట్‌లోకి తీసుకునేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం గట్టి పట్టుదలతో ఉన్నారు. పార్టీ నాయకత్వం మరో ఆలోచన చేస్తున్నప్పటికీ సీఎం రేవంత్ మాత్రం కచ్చితంగా సుదర్శన్‌రెడ్డికి బెర్త్ కేటాయించేందుకు అధిష్టానంపై ఒత్తిడి పెడుతున్నారు. దీంతో సుదర్శన్‌రెడ్డికి బెర్త్ ఖాయమని పార్టీ శ్రేణులు చెబుతున్నాయి.

భూపతిరెడ్డి వివరాలను సేకరించిన మీనాక్షి నటరాజన్..

రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఇటీవల నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి వివరాలను సేకరించినట్లు తెలుస్తోంది. మీనాక్షి నటరాజన్ గత ఎన్నికలకు ముందు నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని ఇందల్వాయి, జక్రాన్‌పల్లి మండలాల్లోని సిర్నాపల్లి, ఎల్లారెడ్డిపల్లి, కలిగోట్, తొర్లికొండ, మండలాల్లో 60 కిలోమీటర్ల మేర రాజీవ్‌గాంధీ సంఘటన మిషన్ కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర చేశారు. తరువాత ఆర్మూర్ మండలం చేపూర్, బాల్కొండ నియోజకవర్గంలోని మెండోరా వరకు పాదయాత్ర చేశారు. ఆమె ఇటీవల రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జిగా వచ్చాక ఎమ్మెల్యే భూపతిరెడ్డి గురించిన వివరాలను సేకరించినట్లు తెలుస్తోంది. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన భూపతిరెడ్డి ఎమ్మెల్సీగానూ వ్యవహరించారు. కేసీఆర్‌తో విభేదించి మూడేళ్ల కాలపరిమితి ఉన్న ఎమ్మెల్సీ పదవికి సైతం రాజీనామా చేశారు. తరువాత కాంగ్రెస్‌లో పార్టీ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. బలమైన ప్రత్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను ఢీకొట్టి ఒకసారి ఓడినా పట్టువదలకుండా పార్టీ నిర్మాణం చేసుకుని గత ఎన్నికల్లో విజయం సాధించారు. ఈ క్రమంలో మీనాక్షి నటరాజన్ ప్రత్యేకంగా ఆరా తీసినట్లు సమాచారం. భూపతిరెడ్డి పేరు సైతం కేబినెట్ బెర్త్ కోసం పరిశీలనలో ఉందని సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.

బియ్యం నిలువలు
ఉన్నట్టా? లేనట్టా?

- ఏప్రిల్ 1 నుంచి రేషన్‌కార్డు దారులకు సన్నబియ్యం పంపిణీ
- మిగిలి ఉన్న దొడ్డుబియ్యంపై విజిలెన్స్ ఆరా
- గతంలో డీలర్లకు ఇచ్చిన కోటాలో కొంత మిగిలి ఉన్నట్లు రికార్డుల్లో నమోదు



మోర్తాడ్(బాల్కొండ): రేషన్ డీలర్ల వద్ద మిగిలిపోయిన దొడ్డు బియ్యం నిలువల్లో ఏమైనా తేడా ఉందా? లెక్కలు పక్కాగానే ఉన్నాయా? అనే కోణంలో విచారణ చేపట్టేందుకు విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రంగంలోకి దిగనున్నారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి రేషన్‌కార్డు దారులకు సన్న బియ్యాన్ని పంపిణీ చేయనున్న దృష్ట్యా డీలర్ల వద్ద మిగిలిపోయినట్లు రికార్డుల్లో నమోదైన దొడ్డు రకం బియ్యం వాస్తవ నిల్వలను తెలుసుకునేందుకు తనిఖీలను విస్తృతం చేయాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. పౌరసరఫరాల శాఖ గోదాముల నుంచి ప్రతి నెలా రేషన్ డీలర్లకు దొడ్డు రకం బియ్యాన్ని చేరవేసేవారు. కొన్ని చోట్ల సకాలంలో వినియోగదారులు బియ్యం తీసుకోకపోవడంతో ఆ బియ్యం మిగిలిపోయింది. కొందరు డీలర్లు మాత్రం నిలువలు ఏమీ లేనట్లు చూపగా మరి కొందరు మాత్రం తమ వద్ద నిలువలు ఉన్నాయని రికార్డుల్లో నమోదు చేశారు. ఇలా జిల్లాలోని వివిధ రేషన్ డీలర్ల వద్ద ఈ రోజు వరకూ 6,680 క్వింటాళ్ల 91 కిలోల బియ్యం నిలువ ఉన్నట్లు తేలింది. ఈనెల 20వ తేదీన బియ్యం పంపిణీ ముగిసిపోయిన తరువాత ఈ–పాస్ యంత్రంలో నమోదైన లెక్కలను పరిగణనలోకి తీసుకున్న విజిలెన్స్ అధికారులు తనిఖీలను విస్తృతం చేయాలని నిర్ణయించారు. అనేక చోట్ల బియ్యం నిలువ ఉన్నట్లు రికార్డుల్లో ఉన్నా వాస్తవానికి బియ్యం నిలువలు లేవని తమకు సమాచారం ఉందని విజిలెన్స్ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే డీలర్లకు సమాచారం ఇచ్చిన అధికారులు.. నిల్వ ఉన్న బియ్యాన్ని తాము తనిఖీలకు వచ్చిన సమయంలో పక్కాగా చూపాలని సూచించారు.

దొడ్డు రకం బియ్యం పంపిణీ చేస్తే చర్యలు

లబ్ధిదారులకు ఎట్టిపరిస్థితుల్లోనూ దొడ్డు బియ్యం పంపిణీ చేయొద్దని డీలర్లకు అధికారులు సూచించారు. మిగులు బియ్యాన్ని ఏమి చేయాలి అనే విషయంపై ప్రభుత్వం నుంచి స్పష్టత వచ్చిన తరువాత వెల్లడిస్తామని అధికారులు చెబుతున్నారు. రికార్డుల్లో చూపిన విధంగా బియ్యం నిలువలు లేని పక్షంలో డీలర్లపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

మిగులు బియ్యం ఉండాల్సిందే

రేషన్ డీలర్లు ఎవరైతే తమ వద్ద దొడ్డు బియ్యం మిగిలి ఉందని లెక్కలు చూపారో ఆ బియ్యం షాపుల్లో ఉండాల్సిందే. లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటాం. మిగులు దొడ్డు బియ్యాన్ని ఏమి చేయాలో ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వచ్చిన తరువాత వెల్లడిస్తాం. – అరవిందొరెడ్డి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి

టమాట సాగు వైపే మొగ్గు!



జలాల్‌పూర్‌లో సాగవుతున్న టమాట

- ధర దక్కుతుందని అన్నదాతల ఆశ
- ప్రతి ఏడాది వేసవిలో పెరుగుతున్న సాగు

బాల్కొండ: వేసవిలో టమాట సాగు ఏటేటా పెరుగుతోంది. ఈ ఏడాది సైతం అన్నదాతలు టమాట సాగువైపే మొగ్గు చూపారు. టమాటకు మంచి ధర దక్కుతుందని ఆశతో సాగు చేపట్టారు. గత మూడు సంవత్సరాల క్రితం వేసవి సీజన్‌లో 25 కిలోల టమాట బాక్స్ ధర రూ.3 వేల వరకు పలికింది. దీంతో ఏదో ఒక సమయంలో ధర వస్తుందనే ఆశతో ఏటా టమాట పంటను సాగు చేస్తున్నారు. స్వల్పకాలిక పంట కావడంతో ప్రస్తుతం పసుపు పంట తవ్విన నేలలో అధికంగా టమాటను సాగు చేశారు. మరో పక్షం రోజుల్లో కాత ప్రారంభమవుతుంది. ప్రస్తుతం టమాట ధర అంతగా లేకున్నప్పటికీ కాత ప్రారంభమయ్యే వరకు ధర పెరుగుతుందని రైతులు ఆశిస్తున్నారు. తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉద్యానశాఖ అధికారులు వివరించాలని రైతులు కోరుతున్నారు.

ధర పలుకుతుందని..



ఈ సీజన్‌లో మంచి ధర వస్తుందని ఆశతో ఎకరం భూమిలో టమాట సాగు చేశాను. మదనపల్లి టమాట వేసవిలో మన వైపు రాదు. అందుకే ధర ఉంటుందని పంటను సాగు చేశాం. మంచి ధర రావాలని కోరుకుంటున్నాం. – కొత్తపల్లి దేవేందర్, రైతు

ధాన్యం సేకరణతో ఆర్థిక ప్రగతి సాధించాలి

- ఎస్‌హెచ్‌జీలకు 200 పైగా కొనుగోలు కేంద్రాలు
- మహిళా సాధికారతకు ప్రాధాన్యత ఇస్తున్న సీఎం రేవంత్
- సన్నాహక సమావేశంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, పాల్గొన్న కలెక్టర్ హనుమంతు తదితరులు



పాల్గొన్న స్వయం సహాయక సంఘాల మహిళలు

నిజామాబాద్ అర్బన్: ధాన్యం సేకరణ ద్వారా మహిళా సంఘాలు ఆర్థిక ప్రగతి సాధించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు 200 పైగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేటాయించాలని నిర్ణయించామన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణపై మహిళా సంఘాల ప్రతినిధులతో మంగళవారం కలెక్టరేట్‌లో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి ధాన్యం సేకరణ, కొనుగోలు కేంద్రాల నిర్వహణపై కీలక సూచనలు చేశారు. మహిళా సాధికారతకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎనలేని ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల విద్యార్థినీవిద్యార్థుల యూనిఫామ్‌లు కుట్టే బాధ్యతను, ఇందిరమ్మ మహిళా శక్తి క్యాంటీన్లు, ఆర్టీసీ అద్దె బస్సులు, పెట్రోల్ పంప్‌లు, సోలార్ విద్యుత్ ఉత్పత్తి యూనిట్ల వంటి సుమారు 14 రకాల పనులను ప్రభుత్వం మహిళలకు కేటాయిస్తూ, వారి అభ్యున్నతికి ఎంతోగానో కృషి చేస్తోందన్నారు. గత సీజన్‌లో ఐకేపీ మహిళా సంఘాల ద్వారా జిల్లాలో కేవలం 50 కేంద్రాలు మాత్రమే నిర్వహించామని, ఈ సీజన్‌లో ఇప్పటికే 110 కేంద్రాల నిర్వహణ కోసం ఎస్‌హెచ్‌జీ గ్రూపులను గుర్తించినట్లు వివరించారు. కొనుగోలు కేంద్రాల సంఖ్యను 200 పైగా పెంచాలని, తద్వారా మహిళా సంఘాలు కమీషన్ రూపంలో సుమారు రూ.5 కోట్ల వరకు లాభాలు ఆర్జించగలుగుతాయని అన్నారు. మహిళా సంఘాల ప్రతినిధులకు ధాన్యం సేకరణ, కేంద్రాల నిర్వహణపై సహకార సంఘాల బాధ్యులు, సంబంధిత అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో ఎవరైనా ఇబ్బందులు సృష్టించే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తప్పవని సుదర్శన్‌రెడ్డి హెచ్చరించారు.

కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహించే మహిళా సంఘాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా మద్దతు అందిస్తుందన్నారు. ముఖ్యంగా ధాన్యం రవాణాకోసం లారీలు, హమాలీల కొరత తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. పెద్ద మొత్తంలో ఆర్థిక పరమైన లావాదేవీలతో ధాన్యం సేకరణ ప్రక్రియ ముడిపడి ఉందని, ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా రికార్డులను సక్రమంగా నిర్వహించేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, డీఆర్డీవో సాయాగౌడ్, సివిల్ సప్లయిస్ డీఎం శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్, మెప్మా పీడీ రాజేందర్, డీసీవో శ్రీనివాస్, మార్కెటింగ్ ఏడీ గంగవ్వ, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

తుస్సుమన్న ఆశలు

- శాతవాహన యూనివర్సిటీకి ఇంజినీరింగ్ కళాశాల
- తెలంగాణ యూనివర్సిటీపై ఎందుకీ వివక్ష అంటున్న విద్యావేత్తలు
- సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినా జిల్లాకు మొండిచేయి
- ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల వైఫల్యమని విద్యార్థి సంఘాల ఆగ్రహం



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీకి ఇంజినీరింగ్ కళాశాల మంజూరవుతుందని అంతా భావించినప్పటికీ ఆశలు తుస్సుమన్నాయి. శాతవాహన యూనివర్సిటీకి ఇంజినీరింగ్ కళాశాల మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ కావడంతో రాష్ట్ర ప్రభుత్వం తెయూపై మరోసారి వివక్ష ప్రదర్శించిందని విద్యావేత్తలు, విద్యార్థి సంఘాల నాయకులు, జిల్లావాసులు మండిపడుతున్నారు. స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినా ఇంజినీరింగ్ కళాశాల మంజూరు విషయంలో జిల్లాను విస్మరించారంటున్నారు. ఇంజినీరింగ్ కళాశాల కోసం ఉద్యమాలు చేసినా మొండిచేయి చూపారని, అడగకుండానే కరీంనగర్ జిల్లాకు ఇంజినీరింగ్ కళాశాల మంజూరు చేశారని వాపోతున్నారు. ఇది పూర్తిగా జిల్లాకు చెందిన రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల వైఫల్యమని విమర్శిస్తున్నారు.

తెలంగాణ యూనివర్సిటీ ఏర్పాటై 18 ఏళ్లు గడుస్తున్నా, వర్సిటీకి 577 ఎకరాల సువిశాల ప్రాంగణం ఉన్నా, ఇక్కడి నుంచి పంపిన ప్రతిపాదనలను పట్టించుకున్న వారు లేరు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు అంశాన్ని గుర్తుచేయగా సానుకూలంగా స్పందించినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. జిల్లా నుంచి మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేకపోవడంతో తీవ్ర నష్టాన్ని కలిగిస్తోందని, ఇప్పటికైనా మించిపోయింది లేదని, కొత్త విద్యాసంవత్సరం ప్రారంభమయ్యేలోగా జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డిపై ఒత్తిడి తెచ్చి ఇంజినీరింగ్ కళాశాల మంజూరు చేయించుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

ప్రభుత్వానికి ఎందుకీ వివక్ష



తెలంగాణ రాష్ట్రం పేరుతో ఏర్పడిన తెలంగాణ యూనివర్సిటీకి ఈసారైనా ఇంజినీరింగ్ కళాశాల మంజూరు చేస్తారనుకుంటే మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వం వివక్ష చూపింది. ఇప్పటికైనా తెయూలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలి. లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతాం. – రాచకొండ విఘ్నేశ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

మంత్రులు ఉన్న జిల్లాలకే..



మంత్రులు ఉన్న జిల్లాలకే ఇంజినీరింగ్ కళాశాలలు మంజూరు చేసుకుంటున్నారు.. తెలంగాణ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేసి సాంకేతిక విద్యను పేద విద్యార్థులకు అందుబాటులోకి తేవాలి. రాజేశ్వర్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి

గ్రామీణ విద్యార్థులకు ఉపయోగం



తెలంగాణ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేస్తే ఉమ్మడి నిజామాబాద్ జిల్లాతోపాటు నిర్మల్, ఆదిలాబాద్ జిల్లా గ్రామీణ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఈ దిశగా రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి. – ఆకుల దేవిక, ఐఎంబీఏ, తెయూ

అన్ని ప్రయత్నాలు చేశాం



గత రెండు సంవత్సరాలుగా ఇంజినీరింగ్ కళాశాల మంజూరు ప్రతిపాదనలు ఉన్నత విద్యాశాఖకు పంపిస్తున్నాం. ఎమ్మెల్యేలు భూపతిరెడ్డి, సుదర్శనరెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. వర్సిటీలో వసతులకు కొరత లేదు. అనుమతులొస్తే కోర్సులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాం. – టి యాదగిరి రావు, వీసీ, తెయూ

ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతోనే..



తెలంగాణ యూనివర్సిటీతో పోలిస్తే అన్ని విధాలుగా వెనుకబడి ఉన్న యూనివర్సిటీలకు ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల లేకపోవడం జిల్లా ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంగా చెప్పొచ్చు. – బి.శివ, ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు

క్లుప్తంగా

అవార్డు గ్రహీతకు సన్మానం



తెయూ(డిచ్‌పల్లి): తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరులో ఈనెల 23 జరిగిన ఇంటర్నేషనల్‌ సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ కాంగ్రెస్‌–2025 కార్యక్రమంలో తెలంగాణ యూనివర్సిటీ వృక్షశాస్త్ర విభాగం సీనియర్‌ ప్రొఫెసర్‌ ఎం.అరుణకు బోధన, పరిశోధన విభాగంలో ఇంటర్నేషనల్‌ అవుట్‌ స్టాండింగ్‌ రీసెర్చ్‌ అవార్డు లభించింది. ఈసందర్భంగా అవార్డు గ్రహీత అరుణను మంగళవారం తెయూ వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్‌ యాదగిరి అభినందించి, సన్మానించారు. వృక్షశాస్త్ర విభాగాధిపతి హలీంఖాన్‌, ప్రొఫెసర్‌ విద్యావర్ధిని, అధ్యాపకులు శ్రీనివాస్‌, జలంధర్‌ తదితరులు పాల్గొన్నారు.

జీజీ కళాశాలలో జాబ్‌మేళా

నిజామాబాద్‌ అర్బన్‌: నగరంలోని జీజీ కళాశాలలో మంగళవారం తెలంగాణ స్కిల్స్‌ నాలెడ్జ్‌ సెంటర్‌ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్‌ రామ్మోహన్‌ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు తమ భవిష్యత్తును ఉత్తమంగా తీర్చిదిద్దుకోవాలంటే ఆయా రంగాల్లో నైపుణ్యం కలిగి ఉండాలన్నారు. ఈ మేళాలో హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్‌, శ్రీచైతన్య టెక్నో స్కూల్‌ వారు పాల్గొని ఉద్యోగాలకు పలువురిని ఎంపిక చేసుకున్నారు.

కరెంటు షాక్‌తో రైతు మృతిపై కేసు నమోదు

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని రాంపూర్‌గడ్డ తండాలో సోమవారం కరెంటు షాక్‌తో పిట్ల శ్రీను (32) అనే రైతు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై మృతుడి భార్య పూజ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

ఎల్లారెడ్డిలో మహిళ అదృశ్యం

ఎల్లారెడ్డిరూరల్‌: పట్టణంలో ఓ మహిళ అదృశ్యమైనట్లు ఎస్సై మహేష్‌ మంగళవారం తెలిపారు. ఎల్లారెడ్డిలోని కల్యాణిబేస్‌ కాలనీలో నివాసముండే ఎండ్లూరి రాజేశ్వరి (28) అనే మహిళ ఈనెల 19న ఇంటి నుంచి ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లింది. ఇప్పటివరకు తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో రాజేశ్వరి భర్త పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్‌ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

శిథిలావస్థలో వంతెన

- ఖాజాపూర్‌–హున్సా గ్రామల మధ్య వాగుపై 25 ఏళ్ల క్రితం నిర్మాణం
- అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వగుళ్లు ఏర్పడిన వైనం



శిథిలావస్థకు చేరిన ఖాజాపూర్‌- హున్సా గ్రామాల మధ్యగల వాగుపై వంతెన



వంతెనపై కూలిన సైడ్‌వాల్‌

బోధన్‌: సాలూర మండలంలోని ఖాజాపూర్‌–హున్సా గ్రామాల మధ్య ఉన్న వాగుపై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకుంది. వంతెన పైభాగంలో పగుళ్లు ఏర్పడటంతోపాటు, సైడ్‌వాల్స్‌ దెబ్బతినడంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. అయినా అధికారులెవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పలు మండలాలకు ప్రధాన వారధి..

ఖాజాపూర్‌–హున్సా గ్రామాల మధ్య గల వాగుపై గతంలో లో–లెవల్‌ వంతెన ఉండగా 25ఏళ్ల క్రితం హైలెవల్‌ వంతెనను నిర్మించారు. ఈ వంతెన బోధన్‌, సాలూర, పోతంగల్‌, కోటగిరి మండలాలకు మధ్య రాకపోకలకు ప్రధాన వారధిగా ఉంది. పొరుగున ఉన్న మహారాష్ట్ర సరిహద్దు ముఖ్య పట్టణాలు, గ్రామాల నుంచి సాలూర మండల కేంద్రం నుంచి ఖాజాపూర్‌ వంతెన మీదుగా ఇతర మండలాలకు వెళ్తుంటారు. పోతంగల్‌, బీర్కూర్‌ మండలాల మీదుగా బాన్సువాడ, జుక్కల్‌ మండలంలోని బిచ్కుంద, మద్నూర్‌, మహారాష్ట్రలోని దెగ్లూర్‌ తాలూకా కేంద్రాలకు ఈ వంతెన పైనుంచి ప్రజలు వ్యక్తిగత పనులు, శుభకార్యాలకు రాకపోకలు సాగిస్తుంటారు. దీంతోపాటు నిత్యం ఆర్టీసీ బస్సులు, ప్యాసింజర్‌ ఆటోలు, ద్విచక్రవాహనాలు రవాణా వేలసంఖ్యలో ఉంటుంది. మంజీర నది తీరంలో ఉన్న హున్సా, మందర్న, ఖాజాపూర్‌ గ్రామాల శివారులోని ఇసుక క్వారీల నుంచి టిప్పర్లు, ఇసుక ట్రాక్టర్ల రవాణా జోరుగానే సాగుతుంది. దీంతో అధిక బరువుల వాహనాల రవాణాతో వంతెన దెబ్బతింటోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెనకు వెంటనే పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవాలి..



మా గ్రామం పక్కనే ఉన్న వంతెన కూలిపోయే దశకు వచ్చింది. ఆలస్యం చేయకుండా అధికారులు తాత్కాలికంగానైనా మరమ్మతులు చేపట్టాలి. ఈ వంతెన మీదుగా వాగు అవతలి ఒడ్డున ఉన్న రైతులమంతా పొలాలకు నిత్యం వెళ్తుంటాం. మా గ్రామస్తులకే కాక అనేక గ్రామాల ప్రజల రాకపోకలకు వంతెన ఎంతో సాకర్యం ఉంది. అధికారులు ఇప్పటికైనా స్పందించాలి.

– చిద్రపు రమేష్‌, ఖాజాపూర్‌, సాలూర మండలం

‘లక్ష్మి’ ఎత్తిపోసేనా..!

- లక్ష్మి కాలువ హెడ్‌ రెగ్యులేటర్‌ ఎత్తిపోయే ప్రమాదం
- ట్రయల్‌ రన్‌ చేయని అధికారులు



లక్ష్మి కాలువ హెడ్‌రెగ్యులేటర్‌

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌లో లక్ష్మి కాలువ హెడ్‌ రెగ్యులేటర్‌ ఎత్తిపోయే ప్రమాదం ఉంది. ప్రాజెక్ట్‌ నీటిమట్టం వేగంగా తగ్గుముఖం పట్టడంతో ప్రస్తుతం 19 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. ప్రాజెక్ట్‌ నుంచి 17 టీఎంసీల నీటి నిల్వ వరకే లక్ష్మి కాలువ హెడ్‌రెగ్యులేటర్‌ నుంచి కాలువ ద్వారా నీటి విడుదల చేపట్టవచ్చు. ప్రస్తుత నీటి వినియోగం లెక్క ప్రకారం మరో వారం రోజుల్లో ఎత్తిపోయే ప్రమాదం ఉంది. కానీ ఇప్పటి వరకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. హెడ్‌ రెగ్యులేటర్‌ ఎత్తిపోగానే ఒక్కసారి లిఫ్ట్‌ మోటార్లు మొరాయిస్తే పరిస్థితి ఏంటిదని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి లక్ష్మి లిఫ్ట్‌ ఎత్తిపోయుటకు సిద్ధంగా ఉంచాలని రైతులు కోరుతున్నారు.

సిద్ధం చేస్తున్నాం..

లక్ష్మి కాలువ హెడ్‌ రెగ్యులేటర్‌ ఎత్తిపోతే లక్ష్మి లిఫ్ట్‌ ద్వారా నీటిని ఎత్తిపోయుటకు పంపులను సిద్ధం చేస్తున్నాం. రెండు రోజుల్లో ట్రయల్‌ రన్‌ చేసుకుంటాం. ఎత్తిపోయే ప్రమాదం ఉండదని భావిస్తున్నాం. అవసరమైతే వెంటనే లిఫ్ట్‌ నుంచి నీటిని ప్రారంభిస్తాం.

– సురేశ్‌, డిప్యూటీఈఈ, మైనర్‌ ఇరిగేషన్‌, బాల్కొండ

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

నిజామాబాద్‌ సిటీ: రాష్ట్రంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరికి అర్థమయ్యేలా వివరించాలని సిరిసిల్ల గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ సత్యనారాయణ అన్నారు. ఇందుకోసమే ‘జైబాపు–జై భీం–జై సంవిధాన్‌ అభియాన్‌’ కార్యక్రమం రూపొందించినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్‌ భవన్‌లో డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం ‘జైబాపు–జైభీం–జైసంవిధాన్‌ అభియాన్‌’ కార్యక్రమ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని అవమానపరిచేలా చేసే చర్యలు, అప్రజాస్వామిక నిర్ణయాలను ప్రజలు వివరించాలన్నారు. తనను నిజామాబాద్‌ అర్బన్‌, బోధన్‌ నియోజకవర్గాలకు ఇన్‌చార్జిగా వేసినందున తన బాధ్యతలను నెరవేరుస్తున్నాన్నారు. ఉర్దూ అకాడమీ చైర్మన్‌ తాహెర్‌బిన్‌హందన్‌, జిల్లా గ్రంథాలయ చైర్మన్‌ అంతిరెడ్డి రాజారెడ్డి, నాయకులు రత్నాకర్‌, జావేద్‌ అక్రమ్‌, సంతోష్‌, గోపి, రేవతి, అబ్దుల్‌ ఏజజ్‌, రామకృష్ణ, చంద్రకళ, ఉష, విజయలక్ష్మి, విజయ్‌పాల్‌ రెడ్డి, వినయ్‌, యెండల కిషన్‌, జియా, నరేందర్‌ గౌడ్‌, లవంగ ప్రమోద్‌, సంగెం సాయిలు పాల్గొన్నారు.

భగవంతుడికి కృతజ్ఞతాపూర్వకంగా ఉండాలి





స్వామి వారికి చక్రస్నానం చేయిస్తున్న వేద పండితులు, బ్రహ్మోత్సవాలకు హాజరైన సినీ ప్రముఖులు

- గంగోత్రి రామానుజ దాసుస్వామి
- వైభవంగా కొనసాగుతున్న ‘ఇందూరు తిరుమల’ బ్రహ్మోత్సవాలు

మోపాల్‌(నిజామాబాద్‌రూరల్‌): మనుషులు సదా భగవంతుడికి కృతజ్ఞతాపూర్వకంగా ఉండాలని ఆచార్య గంగోత్రి రామానుజ దాసుస్వామి అన్నారు. లోక కార్యానికి భగవంతుడు మనుషులను ఎంచుకుంటాడని, మనల్ని ఎంచుకునేలా అర్హత సాధించాలని తెలిపారు. మండలంలోని నర్సింగ్‌పల్లి ‘ఇందూరు తిరుమల’ ఆలయ 11వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరోరోజు మంగళవారం యాగశాలలో మహా పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ పుష్కరిణిలో స్వామివారికి చక్రస్నానం, సాయంత్రం పుష్ప యాగం కార్యక్రమం చేపట్టారు. అనంతరం దేవనాథ జీయర్‌ స్వామి, ఆచార్య గంగోత్రి రామానుజ దాసుస్వామి భక్తుల నుద్దేశించి ప్రవచనాలు చేశారు. కలియుగంలో హరి నామమే మోక్ష మార్గమని, ప్రతి క్షణం హరి నామం జపిస్తూ ఉండాలని సూచించారు. ఇందూరు తిరుమల దేవస్థానం ఇలలో మరో వైకుంఠంగా వెలుగొందుతుందన్నారు. వేడుకల్లో సినీ దర్శకుడు అనిల్‌ రావిపూడి, ఛాయాగ్రాహకుడు సమీర్‌రెడ్డి, హీరోలు నారాయణమూర్తి, ఆశిష్‌, ఆలయ ధర్మకర్తలు నర్సింహారెడ్డి, దిల్‌రాజు, శిరీష్‌రెడ్డి, విజయసింహారెడ్డి, హరీష్‌, సుదర్శన్‌రెడ్డి దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

న్యాక్‌ సెంటర్‌ నిర్మాణం పూర్తి చేయండి

- బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి



మోర్తాడ్‌(బాల్కొండ): నిరుద్యోగ యువతీయువకులకు స్వయం ఉపాధి కోసం మెరుగైన శిక్షణ ఇవ్వడానికి నిర్దేశించిన న్యాక్‌ సెంటర్‌ భవన నిర్మాణం పనులు కొనసాగేలా చూడాలని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం అసెంబ్లీలో ఆర్‌అండ్‌బీ, టూరిజం, దేవాదాయ, క్రీడాశాఖల పద్దులపై జరిగిన చర్చలో ఆయన వివిధ అంశాలను సభ దృష్టికి తీసుకవెళ్లారు. శ్రీరాంసాగర్‌ ప్రాజెక్టును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని కోరారు. ఎస్సారెస్పీ నుంచి బాసర వరకూ బోట్‌ సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. బిల్లులు మంజూరు కాకపోవడంతో ఆలయాల నిర్మాణం పెండింగ్‌లో ఉందని వెంటనే బిల్లులు మంజూరి చేయాలని కోరారు.

హిందూ పుణ్యక్షేత్రాల యాత్ర పథకం తీసుకురావాలి

- నిజామాబాద్‌ అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ



సుభాష్‌నగర్‌: రాష్ట్రంలో హిందూ పుణ్యక్షేత్రాల యాత్ర పథకం తీసుకొచ్చి హజ్‌ యాత్ర తరహాలో ప్రతి నియోజకవర్గం నుంచి 500 మంది భక్తులకు చార్‌ధామ్‌ యాత్రకు ఆర్థికసాయం అందించాలని అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌ పద్దులపై చర్చలో నిజామాబాద్‌ అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ మంగళవారం సుదీర్ఘంగా మాట్లాడారు. రాష్ట్రంలో తెలంగాణ టెంపుల్‌ డెవలప్‌మెంట్‌ అథారిటీని, తెలంగాణ టూరిజం అభివృద్ధి బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. ఇందూరు ఖిల్లా రామాలయాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్‌చేశారు. రాష్ట్రంలో నూతన సాంస్కృతిక పాలసీని తీసుకురావాలని, కళా ప్రదర్శనకు ప్రతి జిల్లాలో మినీ రవీంద్ర భారతిలను ఏర్పాటు చేయాలని కోరారు. విద్యాశాఖకు కనీసం 15శాతం నిధులు కేటాయించాలన్నారు. గురుకులాల్లో ఫుడ్‌ పాయిజన్‌ కాకుండా ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు. మద్యం దుకాణాలకు దేవుళ్ల పేర్లు పెట్టకుండా చట్టం తీసుకురావాలని సూచించారు. నగరంలోని పాత కలెక్టరేట్‌, మైదానం కలుపుకుని మినీ స్టేడియం, పాత ఇరిగేషన్‌ భవనం స్థలంలో ఇండోర్‌ స్టేడియం నిర్మించాలన్నారు. రాజారామ్‌ స్టేడియంను పూర్తిస్థాయి క్రికెట్‌ స్టేడియంగా అభివృద్ధి చేయాలని కోరారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని టీచర్స్‌ కాలనీలోగల నిజాంసాగర్‌ కెనాల్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్‌ మంగళవారం తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 35–45 ఏళ్ల మధ్యలో ఉంటుందని తెలిపారు. నలుపు రంగు టీషర్ట్‌, సిమెంటు రంగుల నైట్‌ప్యాంట్‌ ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని ఆర్మూర్‌ ఏరియా ఆస్పత్రిలోని మార్చురిలో ఉంచినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

ఎల్లారెడ్డిరూరల్‌: మండలంలోని శివాపూర్‌ గ్రామ శివారులో సైకిల్‌ను బైక్‌ ఢీకొనడంతో ఒకరికి గాయాలైనట్లు స్థానికులు మంగళవారం తెలిపారు. ఎల్లారెడ్డికి చెందిన గంగారాం శివాపూర్‌ నుంచి ఎల్లారెడ్డి వైపునకు వస్తుండగా, ఎల్లారెడ్డి వైపు నుంచి శివాపూర్‌ వైపునకు వస్తున్న బైక్‌ ఢీకొట్టింది. ఈ ఘటనలో సైకిల్‌పై ఉన్న గంగారాంకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఆటో–కారు ఢీకొనడంతో..

ఎల్లారెడ్డి: మండలంలోని కళ్యాణి గ్రామ శివారులో ఆటో–కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. నిజాంసాగర్‌ నుంచి ఎల్లారెడ్డి వైపునకు వస్తున్న కారు కల్యాణి ప్రాజెక్టు వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న నిజాంసాగర్‌కు చెందిన సునీత, అనిత అనే ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. స్థానికులు వారిని సమీప ఆస్పత్రికి తరలించగా, సునీతకు తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్‌కు రిఫర్‌ చేసినట్లు వైద్యులు తెలిపారు.

కారును బస్సు ఢీకొనడంతో..



ఎడపల్లి(బోధన్‌): మండలంలోని జాన్కంపేట్‌ దర్గా వద్ద మంగళవారం కారును నిజామాబాద్‌ నుంచి బోధన్‌ వెళుతున్న ఆర్టీసీ బస్సు వెనుకాల నుంచి వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో కారు ముందున్న లారీకి ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న రవి, అతడి భార్యకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఈమేరకు ఆర్టీసీ డ్రైవర్‌ రమేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీచందర్‌రెడ్డి తెలిపారు.

క్రైం కార్నర్‌

కాలువలో పడి ఒకరి మృతి.. మరొకరు గల్లంతు



బాల్కొండ: మండలంలోని కాకతీయ కాలువలో పడి ఒకరు మృతిచెందగా, మృతుడి ఆచూకీ కోసం వచ్చిన మరో వ్యక్తి అదే కాలువలో పడి గల్లంతయ్యాడు. మెండోరా ఎస్సై నారాయణ తెలిపిన వివరాలు ఇలా.. మహారాష్ట్రలోని నాందేడ్‌ జిల్లా కిన్వట్‌ తాలుకకు చెందిన దేశ్‌ముఖ్‌ మారుతి(32) కూలీ పనుల కోసం ఇటీవల మెండోరాకు వచ్చాడు. రెండు రోజుల క్రితం మారుతి కాలకృత్యాలు తీర్చుకోవడానికి కాలువ వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడి గల్లంతయ్యాడు. కాలువ వద్ద అతడి చెప్పులు ఆధారంగా మంగళవారం గాలింపు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

వెతకడానికి వెళ్లి..



మారుతి గల్లంతయ్యాడని తెలియడంతో వెతుకుట కోసం అదే గ్రామానికి చెందిన హరి లఖోడి రాజారాం, అవినాష్‌ బైక్‌పై సోమవారం బయలుదేరారు. వెల్కటూర్‌ గ్రామ శివారులోని కాకతీయ కాలువ వద్ద వీరి బైక్‌ అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లింది. వెనుక కూర్చున్న అవినాష్‌ పక్కకు దూకగా, బైక్‌పై ఉన్న రాజారాం బైక్‌తో సహ కాలువలో గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నారాయణ పేర్కొన్నారు. గాలింపు చేపట్టినట్లు తెలిపారు.

అనారోగ్యంతో గన్నారం జీపీ కార్యదర్శి మృతి



ఇందల్వాయి: గన్నారం గ్రామ పంచాయతీ కార్యదర్శి(గ్రేడ్‌1) వెంకటేశ్వర్లు అనారోగ్యంతో మృతి చెందారు. ఇందల్వాయి మండల కేంద్రంలో ఉంటూ గన్నారంలో విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు సోమవారం అస్వస్థతకు గురయ్యాడు. దీంతో అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రయివేట్‌ ఆస్పత్రికి తరలించారు. మంగళవారం పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తోటి ఉద్యోగులు తెలిపారు. మృతుడి స్వస్థలం జోగులాంబ గద్వాల్‌ జిల్లా మానవపాడు మండలం అని తెలిసింది. మృతుడికి ఇద్దరు కొడుకులు ఉన్నట్లు సమాచారం.

గుండెపోటుతో వివాహిత..

ఆర్మూర్‌టౌన్‌: పెర్కిట్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో ఓ వివాహితకు ఆపరేషన్‌ చేస్తుండగా గుండెపోటు రావడంతో మృతిచెందినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్‌ తెలిపారు. వివరాలు ఇలా.. మోర్తాడ్‌ మండలం ఏర్గట్ల గ్రామానికి చెందిన మార్వాడి మాన్విత(23)కు ఐదేళ్ల క్రితం నందిపేట్‌ మండలం షాపూర్‌ గ్రామానికి చెందిన సురేష్‌తో వివాహం జరిగింది. పిల్లలు పుట్టటం లేదని మాన్వితకు మంగళవారం పెర్కిట్‌లోని ఓ ఆస్పత్రిలో ఆపరేషన్‌ చేస్తుండగా గుండెపోటు రావడంతో మృతిచెందింది. భర్త సురేష్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ..

ఎల్లారెడ్డి: మెదక్‌ జిల్లా మాసాయిపేటలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎల్లారెడ్డి మండలం కొట్టాల్‌ గ్రామానికి చెందిన బోదాటి సాయవ్వ (43) అనే మహిళ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. సాయవ్వ దంపతులు కొన్ని నెలల క్రితం ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌ వెళ్లారు. ఈక్రమంలో మాసాయిపేటలో కూలి పనులు చేసేందుకు రైలు దిగి రోడ్డు దాటుతున్న సమయంలో సాయవ్వను ఓ ప్రయివేటు బస్సు ఢీకొట్టింది. ఈఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్లు వారు తెలిపారు. సాయవ్వ అంత్యక్రియలు ఆమె స్వగ్రామమైన కొట్టాల్‌లో నిర్వహించినట్లు తెలిపారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

ధర్పల్లి: మండలంలోని హోన్నాజిపేట్‌ గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన ధ్యాప పెద్ద నర్సయ్య (60)కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఇటీవల ఆయన కొత్తగా ఇంటిని నిర్మించుకున్నారు. ఇంటి నిర్మాణానికి అప్పులు కావడంతోపాటు తన మూడో కుమార్తెకు ఆరోగ్యం బాగాలేక వివాహం కావడంలేదు. దీంతో పెద్ద నర్సయ్య మనస్తాపానికి గురై ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య కొమరవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ పేర్కొన్నారు.

ఇష్టం లేని పెళ్లి చేయడంతో యువతి



వల్లెపు లక్ష్మి (ఫైల్‌)

బాన్సువాడ రూరల్‌: మండలంలోని కొల్లూర్‌ గ్రామంలో ఇష్టం లేని పెళ్లి చేయడంతో ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. బాన్సువాడ సీఐ మండలి అశోక్‌ తెలిపిన వివరాలు ఇలా.. కొల్లూర్‌ గ్రామానికి చెందిన వల్లెపు లక్ష్మికి ఫిబ్రవరి 23న అదే గ్రామంలో ఉంటున్న దగ్గరి బంధువైన వెంకటేష్‌ అనే యువకుడితో వివాహం జరిగింది. కాగా లక్ష్మికి వివాహం ఇష్టంలేక మంగళవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు గమనించి ఆమెను బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతురాలి తల్లి చంద్రకళ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అత్తింటి వేధింపులు భరించలేక వివాహిత..



సులోచన (ఫైల్‌)

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని అయిలాపూర్‌ గ్రామంలో ఓ వివాహిత అత్తింటి వేధింపులు భరించలేక ఆత్మహత్యకు పాల్పడింది. ఏఎస్సై ప్రకాష్‌నాయక్‌ తెలిపిన వివరాలు ఇలా.. అయిలాపూర్‌ గ్రామానికి చెందిన గుడ్లోళ్ల సులోచన(32)కు 2018లో కొర్పోల్‌ గ్రామానికి చెందిన కుమార్‌తో వివాహం జరిగింది. వీరికి అభినయ్‌, దీక్షిత ఇద్దరు పిల్లలు. వీరు బతుకుదెరువు కోసం కొన్ని నెలల క్రితం హైదరాబాదుకు వెళ్లగా ఇటీవల కొర్పోల్‌ గ్రామానికి వచ్చారు. ఈక్రమంలో అత్త గంగవ్వ, ఆడపడుచు సాయవ్వ, భర్త కుమార్‌, బావ రవి, తోటి కోడలు లలిత కలిసి సులోచనను మానసికంగా వేధింపులకు గురిచేసేవారు. ఈ విషయం తన తల్లిదండ్రులకు చెప్పగా పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించి సర్దిచెప్పి పంపించారు. అయినప్పటికీ వేధింపులు కొనసాగుతుండటంతో అయిలాపూర్‌లోని తల్లిగారింటికి వచ్చేసింది. ఈక్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతురాలి తండ్రి బాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక పాయింట్‌పై టాస్క్‌ఫోర్స్‌ దాడి

- 9టిప్పర్లు, 3 పొక్లెయిన్లు స్వాధీనం
- 12మంది అరెస్టు



పట్టుబడ్డ డ్రైవర్లతో టాస్క్‌ఫోర్స్‌ అధికారులు

ఖలీల్‌వాడి/బోధన్‌రూరల్‌: బోధన్‌ రూరల్‌ మండలంలోని మందర్నా ఇసుక పాయింట్‌పై టాస్క్‌ఫోర్స్‌ సీఐ అంజయ్య, ఎస్సై గోవింద్‌, స్పెషల్‌పార్టీ సిబ్బంది దాడి చేశారు. సీపీ సాయి చైతన్య ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్‌ ఇన్‌చార్జి అడిషనల్‌ డీసీపీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వారు సోమవారం అర్ధరాత్రి ఇసుకను తరలిస్తున్న తొమ్మిది టిప్పర్లతోపాటు మూడు పొక్లెయిన్లను స్వాధీనం చేసుకున్నారు. 12మంది డ్రైవర్లను అదుపులోకి తీసుకుని తదుపరి చర్య నిమిత్తం బోధన్‌ రూరల్‌ ఎస్సైకి అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్‌ సీఐ అంజయ్య తెలిపారు.

నిబంధనలు పాటించని వ్యాపారులు

మందర్నా ఇసుక పాయింట్‌ నుంచి ప్రభుత్వ పనుల కోసం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు కూలీల ద్వారా ట్రాక్టర్లలలో ఇసుకను తరలించడానికి అవకాశం ఉంటుంది. కానీ టిప్పర్లలలో నిబంధనల కంటే అదనంగా 10 టన్నుల వరకు ఇసుకను తరలిస్తున్నారు. ఇక్కడి నుంచి బోధన్‌ పరిసర ప్రాంతాల వరకు మాత్రమే ఇసుకను తరలించాల్సి ఉంటుంది. కానీ నిజామాబాద్‌ వరకు తరలిస్తున్నారు. అధికారులు ఇసుక తరలింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని బోధన్‌ ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన గల్ఫ్‌ మృతుడి అంత్యక్రియలు



అబుదబి ఎయిర్‌పోర్టు నుంచి గంగాధర్‌ మృతదేహాన్ని తరలిస్తున్న సన్నిహితులు

మోర్తాడ్‌: ఏర్గట్ల మండలం తొర్తి గ్రామానికి చెందిన ఈర్గల గంగాధర్‌(44) ఇటీవల యూఏఈలోని అబుదబిలో ప్రమాదవశాత్తు మృతిచెందగా, మంగళవారం మృతదేహం స్వగ్రామానికి రాగా, అంత్యక్రియలు పూర్తయ్యాయి. గల్ఫ్‌లో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్న గంగాధర్‌ శనివారం బైక్‌పై వెళుతున్న క్రమంలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కంపెనీ యాజమాన్యం, గంగాధర్‌ సన్నిహితులు మృతదేహంను ఇంటికి తరలించడానికి వేగంగా స్పందించడంతో మూడురోజుల్లోనే మృతదేహం స్వగ్రామానికి చేరింది. గ్రామస్తులు, బంధుమిత్రులు అధిక సంఖ్యలో హాజరై అంత్యక్రియలు నిర్వహించారు.

విద్యార్థుల ఆహారం పక్కదారి!

- వంటకాలు, డ్రైఫ్రూట్స్‌ను ఇంటికి తీసుకెళ్తున్న అధికారి

నిజామాబాద్‌ అర్బన్‌: అర్సపల్లి మైనారిటీ పాఠశాలలో ఓ ప్రధాన అధికారి పాఠశాల నుంచి ప్రత్యేక వంటకాలు చేయించుకోవడంతోపాటు డ్రైఫ్రూట్స్‌ను ఇంటికి తీసుకెళ్లడం చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై కొందరు ఇటీవల ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా, అధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం. పిల్లలకు పౌష్టికాహారం అందించడానికి ప్రభుత్వం ప్రత్యేక మెనూను రూపొందించింది. కానీ పాఠశాలలో విద్యార్థులకు చాలీచాలని భోజనం, రుచి లేని వంటకాలు అందించగా సదరు అధికారి మాత్రం ప్రత్యేకమైన వంటకాలు చేయించుకుంటుందని సమాచారం. నిత్యం పిల్లలకు అందించాల్సిన డ్రైఫ్రూట్స్‌ను ఆ అధికారి మాత్రమే తీసుకెళుతుంది. అలాగే బియ్యం రవాణా కోసం ఆటోను వినియోగించుకున్నట్లు అదనంగా బిల్లులు జోడించి అవినీతికి పాల్పడుతున్నట్లు తెలిసింది. ఇటీవల తొలగించిన అవుట్‌సోర్సింగ్‌ ఉద్యోగినిని బిల్లుల సర్దుబాటు కోసం మళ్లీ అనాధికారికంగా ఉపయోగించుకుంటున్నారని పలువురు ఆరోపించారు. దీంతో ఉన్నతాధికారులు విచారణ చేస్తున్నట్లు తెలిసింది. త్వరలోనే చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

చర్యలు తీసుకుంటాం..

పిల్లలకు అందించాల్సిన నాణ్యమైన భోజనంను ప్రత్యేకంగా ఎవరు తీసుకువెళ్లకూడదు. డ్రైఫ్రూట్స్‌ను పిల్లలకు మాత్రమే అందించాలి. పిల్లలకు ఇవ్వకుండా ఇంటికి తీసుకెళ్తే చర్యలు తప్పవు. ఘటనపై విచారణ చేపడుతాం.

– కృష్ణవేణి, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి